సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 07 సంచిక : 348 | పేజీలు : 08, వెల రూ. 2 రూ/ | సోమవారం 02-03-2026



2లో

**వైద్య రంగానికి బడ్జెట్‌లో 6 శాతంతో నిధుల వెల్లువ**

- క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం: సీఎం చంద్రబాబు
- 15 ఏళ్లలోపు బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ
- ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు కీలక హామీ
- గత ప్రభుత్వంలో తిరుమల పవిత్రతకూ భంగం కలిగించారంటూ ఫైర్

## మీకోసం నరక ద్వారాలు తెరిచి ఉంచుతున్నాం..



. అమెరికా, ఇజ్రాయెల్ పై ఇరాన్ ప్రతీకార దాడులు

అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం

ప్రతీకారంగా గంటల వ్యవధిలోనే విరుచుకుపడ్డ ఇరాన్ సైన్యం

కువైట్, దుబాయ్‌లోని అమెరికా బేస్‌లే లక్ష్యంగా క్షిపణి దాడులు

దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సహా పలు కీలక ప్రాంతాల్లో పేలుళ్లు

యుద్ధం విస్తరించే ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన

ఢిల్లీ: మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు దట్టంగా అలుముకున్నాయి. ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు మిగతా.. 2లో

# వేసవి భగభగలు

- ఈ వేసవిలో అత్యధిక వేడిమి రోజులే ఉండే చాన్స్
- ఏప్రిల్ మొదటి వారం నుంచే 40 డిగ్రీలు దాటనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు... మే నెలలో గరిష్ఠంగా
- 44 నుంచి 46 డిగ్రీ సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- భూపాలపల్లి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వడగాలుల ప్రభావం



హైదరాబాద్: వేసవి భగభగలు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుతం సాధారణ స్థితిలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఒకట్రెండు డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదవుతుండగా రానురాను తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా మార్చి నుంచి మే మధ్య కాలాన్ని వేసవి సీజన్‌గా పరిగణిస్తాం. ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి రెండో వారం మిగతా.. 2లో

# దేవుడికి ద్రోహం చేస్తే క్షమించను

- త్వరలో 'ఏఐ డాక్టర్' సేవలు
- కర్నూలులో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్
- దిగ్గజ సంస్థల రాకతో ఉత్తరాంధ్రలో పేదరికం దూరం
- రావివలస ప్రజావేదికలో సీఎం చంద్రబాబు
- పేదల ఇళ్లకు వెళ్లి, సామాజిక పింఛన్ల పంపిణీ



విజయనగరం: ప్రజల ఆరోగ్య ప్రమాణాలు పెంచేందుకు అత్యాధునిక వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యరంగాన్ని బలోపేతం చేస్తున్నామని, ఇప్పటికే సంజీవని పేరిట డిజిటల్ హెల్త్ రికార్డుల నమోదు చేపట్టామని గుర్తుచేశారు. త్వరలో 'ఏఐ డాక్టర్' ద్వారా రోగులకు ప్రాథమిక అంశాల్లో సందేహాలు నివృత్తి చేస్తామని, అవసరమైతే చికిత్స కూడా జరిగేలా చూస్తామన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించారు. తొలుత చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. మిగతా.. 2లో

## హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన సీఎం

విద్యార్థినికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది, చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్



విజయనగరం, న్యూస్‌టుడే, చీపురుపల్లి/గ్రామీణం: భవిష్యత్తులో క్యాన్సర్ రహిత సమాజానికి అందరం పాటుపడదామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో శనివారం ఆయన ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో ఈ ప్రక్రియ తీరును పరిశీలించారు. 14 ఏళ్ల బాలికలు ఎ.పావని, పి.కౌశల్యకీర్తి, కె.లావణ్య, పి.జోషికకు టీకాలు వేయించారు. అనంతరం వారితో మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, డైరెక్టర్ కె.పద్మావతి, రాష్ట్ర ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి తదితరులు పాల్గొన్నారు

## జలమండలికి భూ కేటాయింపులు రద్దు

శారదాపీఠం భూముల అంశంపై సీఎం ఆరా

శారదాపీఠం భూములపై సీఎం రేవంత్ కీలక నిర్ణయం

కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ పరిధిలో సుమారు రెండున్నర ఎకరాల భూమిని కేటాయించింది



హైదరాబాద్: తెలంగాణలోని శారదాపీఠం భూముల అంశానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. భూములను శారదా పీఠానికే కొనసాగించాలని ఆదేశించారు. అదే సమయంలో జలమండలికి భూ కేటాయింపులు రద్దు చేశారు. మిగతా.. 2లో

# ఖమేనీ హత్య హేయమైన చర్య

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను తీవ్రంగా ఖండించిన ప్రియాంక గాంధీ



ప్రజాస్వామ్య దేశాల తీరు హేయమంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం

మహాత్మా గాంధీ సూక్తులను గుర్తు చేస్తూ శాంతి ఆవశ్యకతపై ట్వీట్

గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయులను రక్షించాలని మోదీకి డిమాండ్

వయనాడ్ : వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యను తీవ్రంగా ఖండించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీ మరణించడం, అనంతరం మిగతా.. 2లో



2లో

## 'ఇరాన్‌పై దాడుల్ని భారత్ ఖండించాలి'

'ఇరాన్‌పై దాడులను మేం ఖండిస్తున్నాం

- ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్య చట్టవిరుద్ధం
- ఆయన షియా సమాజానికి గొప్ప నాయకుడు'
- ఇరాన్‌పై దాడుల్ని తక్షణమే ముగియాలని,ఈ విషయంలో భారత ప్రభుత్వం తన పాత్ర పోషించాలి

## జూన్ 2న తెలంగాణ పండుగ ఘనంగా జరుపుకోవాలి

- ప్రజాపాలనప్రగతి ప్రణాళిక పేరుతో రాష్ట్రమంతటా ప్రత్యేక కార్యక్రమం
- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు...
- పౌర సేవలను సులభతరం చేసేలా సాంకేతిక సంస్కరణలు
- సంస్కరణల కోసం సీనియర్ ఐఏఎస్ జయేశ్ ఆధ్వర్యంలో కమిటీ
- ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక
- 4న కలెక్టర్ల సమావేశంలో అందరి పనితీరుపై మాట్లాడతా



- కార్యదర్శుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజాప్రభుత్వ పథకాలు.. అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'కార్యక్రమం చేపడుతున్నట్లు మిగతా.. 2లో

# నేర ప్రవృత్తి విడిచి సన్మార్గంలో జీవించండి

ఎస్సై నాగర్జున



**ప్యాపిలి మార్చి 01 (సీమ కిరణం న్యూస్) :** రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వదిలి సన్మార్గంలో నడవాలని ప్యాపిలి ఎస్సై నాగార్జున సూచించారు. ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్యాపిలి పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబంతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడపాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసులు నేర నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

# ఎస్ఐఆర్‌కు ప్రజల సహకారం కీలకం

కర్నూలు ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్



**కర్నూలు ప్రతినిధి మార్చి 01 (సీమ కిరణం న్యూస్) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని, ప్రజల పాత్రే కీలకమని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం ఆయన ఏ.క్యాంపు మోంటెస్సోరి స్కూల్, కలెక్టరేట్ వెనుక ఇందిరా గాంధీ స్మారక మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన ఎస్ఐఆర్ స్పెషల్ క్యాంపెయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుకు విలువ పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన యువత తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, పేర్లలో పొరపాట్లు ఉంటే సవరణ చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. చిరునామా మారిన వారు, కొత్తగా నివాసం ఏర్పరచుకున్న వారు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా శుద్ధి ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, ఎస్ఈ రమణమూర్తి, సూపరింటెండెంట్లు మంజూర్ బాషా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.ది

# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్ఐ పి నిరంజన్ రెడ్డి



**పెద్దకడబూరు మార్చ్ 1 (సీమ కిరణం న్యూస్) :** పెద్దకడబూరు మండలంలో రౌడీషీట్ కలిగిన వ్యక్తులకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసు రికార్డుల్లో పేర్లు నమోదైన రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, గొడవలు చేయకుండా చట్టాలను గౌరవించాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని, ఏవైనా వివాదాలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో పరిష్కరించుకోవాలని హెచ్చరించారు. హనుమాపురం గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేయడం అనేది తనిఖీల్లో భాగంగా 17 మంది వాహనదారులకు హెల్మెట్లు ధరించని, డ్రైవింగ్ లైసెన్స్ లేనటువంటి మరియు ట్రిపుల్ రైడింగ్ చేసేవారికి జరిమానాగా రూ.3995 లు విధించడమైనది.

# అక్రమంగా మందు గుండు సామాగ్రి నిల్వలు ఉండకూడదు

డి ఎస్ పి ఆవుల శ్రీనివాసరావు



**రేపల్లె మార్చి 01 (సీమ కిరణం న్యూస్) :** రేపల్లె సబ్-డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో ఎక్కడా కూడా దీపావళి మందు గుండు సామాగ్రి నిల్వలు ఉండకూడదు అని రేపల్లె డి ఎస్ పి ఆవుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక అనుమతి పొందిన వారి వద్ద గానీ, మరియే ఇతరుల వద్ద గానీ దీపావళి టపాసులు, మందుగుండు సామాగ్రి, ఇతర ప్రేలుడు పదార్థాలు నిల్వ ఉన్నట్లయితే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ అనుమతులు పొందిన గోడౌన్‌ల వద్ద అప్పగించాలని ఆయన సూచించారు. ఇందుకు ఎవరైనా విరుద్ధంగా టపాసులు గానీ, ఇతర ప్రేలుడు పదార్థాలు గానీ నిల్వ ఉన్నట్లయితే వారిపైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిల్వలున్న వివరాలు తెలియజేసిన వారికి తగిన ప్రోత్సాహకం అందిస్తామన్నారు. ఇది ప్రజల భద్రతకు సంబంధించినది కనుక ప్రతీ ఒక్కరు భాద్యతగా వ్యవహరించి సహకరించాలని డి ఎస్ పి శ్రీనివాసరావు కోరారు.

# ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి





**కర్నూలు ప్రతినిధి మార్చి 01 (సీమ కిరణం న్యూస్) :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, విద్య, ప్రజా పంపిణీ వ్యవస్థ అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా హ్యాండ్ పంప్‌లను (చేతి పంపులు) వినియోగంలోకి తీసుకురావాలన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేసి, చేతి పంపులను సిద్ధం చేయాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఫ్లోరైడ్ సమస్యను నివారించడం, తాగునీటి వనరులు లేని గ్రామాలకు నీరు అందించడమే సుజల ప్లాంట్ల ముఖ్య ఉద్దేశ్యం అని, కోడుమూరు, తుగ్గలి, కృష్ణగిరి, వెల్దుర్తి, కౌతాళం, నందవరం, హొళగుంద, నందికొట్కూరు మండలాల్లో మదర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, నీటిని సరఫరా చేయాలని కోట్లాది రూపాయలను ఖర్చు చేశారన్నారు. అయితే ప్రస్తుతం వీటి నిర్వహణ సరిగా లేదని, వీటిని పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈ 8 మండలాల్లో ఎన్ని ప్లాంట్లు పని చేస్తున్నాయి? వాటి స్థితిగతులు ఏమిటి? అనే దానిపై పూర్తి వివరాలు అందించాలని ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషిచేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న అదనపుగదులు, టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా కస్తూర్బా పాఠశాలల్లో సీట్ల పెంపు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మాట్లాడుతూ జిల్లాలో వేసవిలో తాగు నీటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల కు జనవరి 10 వరకు తుంగభద్ర నీటిని విడుదల చేయడం జరిగిందని, ప్రస్తుతం 70 శాతం నీటితో నిండి ఉన్నాయని కలెక్టర్ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఏప్రిల్ రెండో వారం నుండి మళ్ళీ నీటిని తుంగభద్ర నుండి విడుదల చేయాలని కోరామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6 మండలాల్లో సుజల స్రవంతి మదర్ ప్లాంట్ లకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్, నిధుల ప్రతిపాదనలను పది రోజుల్లోపు పంపించాలని కలెక్టర్ ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. దేవనకొండ మండలంలో మోడల్ స్కూల్ లేదని జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించగా, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.18 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమం లో భాగంగా 1,61,000 మంది నిరక్షరాస్యులను గుర్తించి, 16,000 మంది వాలంటీర్ల ద్వారా వారికి గత రెండు నెలలుగా విద్యను బోధించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ పాణ్యం మండలం తమ్మరాజుపల్లెలో పైప్‌లైన్ పనుల కోసం జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.4 లక్షలు మంజూరు చేయాలని కోరామని, ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. వేసవి కాలం దృష్ట్యా, ఇప్పుడైనా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. గడివేముల మండలం కరిమద్దల గ్రామంలో కొత్తగా బోరు వేయడంతో పాటు పైప్‌లైన్ పనుల కోసం రూ.5 లక్షల నిధులు అవసరమని, గని గ్రామంలో వాల్మీకి వీధిలో నీటి సమస్య ఉందని కనీసం రూ.4 లక్షలు అవసరమన్నారు.. ఈ మూడు ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా జెడ్పీ నిధుల నుండి మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గత ప్రభుత్వ హయాంలో 2021 సెప్టెంబర్‌లో అలగనూరు రిజర్వాయర్ గండి పడిందని, అప్పట్లో కేవలం రూ.3 కోట్లతో పూర్తి కావాల్సిన పనులు, పి.పనులు ఆగిపోవడం వల్ల ఇప్పుడు పూర్తి చేయడానికి రూ.36 కోట్లు అవుతోందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.36 కోట్లను మంజూరు చేస్తూ, త్వరలోనే జీవో (జి ఒ) కూడా రాబోతుందన్నారు. పాణ్యం మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ హాస్టల్ కు ప్రభుత్వం ఇప్పటికే ల్యాబ్ లు, అదనపు గదుల కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందన్నారు. కేవలం టాయిలెట్ల సౌకర్యం మెరుగుపరచాలని కలెక్టర్ ను కోరారు. పాణ్యంలోని గిరిజన హాస్టల్‌లో కూడా ఇతర అభివృద్ధి పనులు జరిగాయని, కేవలం టాయిలెట్ల నిర్మాణం మాత్రమే పెండింగ్‌లో ఉందని వాటిని కూడా పూర్తి చేయాలని నంద్యాల కలెక్టర్ ను కోరారు. రాష్ట్ర కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప మాట్లాడుతూ గత సమావేశంలో కోరిన విధంగా ఆదోని మండలం చిన్న హరివాణం గ్రామంలో పైపులైన్ పనుల కోసం రూ.80 లక్షల రూపాయలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పైపులైన్ పనులు పూర్తయ్యాయని, నిన్నటి నుండి గ్రామానికి నీటి సరఫరా కూడా ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం ఎండాకాలం దృష్ట్యా ఆూ ట్యాంకుల రిపేరు కోసం టెండర్లు పిలుస్తున్నారని, అయితే కొందరు 40% నుండి 50% తక్కువ (లెస్ ) ధరకే టెండర్లు వేస్తున్నారన్నారు. ఇంత తక్కువ ధరకు టెండర్లు తీసుకుంటే పనుల్లో నాణ్యత ఉండదని, నాణ్యతతో పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తుంగభద్ర డ్యామ్ గేట్ల రిపేరు వల్ల జనవరి 15 నుండి నీటి సరఫరా ఆగిపోయిందని, గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు తుంగభద్ర డ్యామ్ నుండి తాగునీటిని విడుదల చేయించాలని కోరారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ మరియు అనుబంధ శాఖల 2025-2026 ఆర్థిక సంవత్సరపు సవరణ బడ్జెట్ మరియు 2026 - 2027 ఆర్థిక సంవత్సరపు అంచనాల బడ్జెట్ సంగ్రహమునకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని సంతకాల సేకరణ

సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నరసింహులు



**కర్నూలు ప్రతినిధి మార్చి 01 (సీమ కిరణం న్యూస్) :** ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మార్చి ఒకటవ తారీఖు నుండి పదవ తారీకు వరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అన్ని అమలు చేయాలని కోరుతూ సంతకాల సేకరణకు పిలుపు ఇవ్వడం జరిగింది. అందులో భాగంగానే కర్నూల్ నగరంలోని 23వ వార్డు శ్రీరామ నగర్ లో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది భవన నిర్మాణ కార్మిక సంఘం వార్డు నాయకులు జి లక్ష్మన్న కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నరసింహులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించాలని గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని దశలవారీగా రెండు సంవత్సరాలు సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం కారణంగా కూటమి ప్రభుత్వం దిగివచ్చి సంక్షేమ పథకాలను పునర్ ప్రారంభిస్తామని చెప్పి ప్రసవ కానుక 20,000 వివాహ కానుక 40 వేలు సాధారణ మరణానికి 60000 మట్టి ఖర్చులకు 20,000 అంటూ నాలుగు పథకాలను ప్రకటిస్తూ మార్చి ఒకటో తేదీ నుండి అమలులోకి వస్తుందని జీవోను రిలీజ్ చేసింది ఈ జీవోలో గతంలో సంక్షేమ పథకాలు అమలైన విధంగా అమలు చేయకుండా కొన్నింటిని మాత్రమే ప్రకటించడం చాలా అన్యాయం అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు గతంలో కార్మికుని కుటుంబానికి ఇచ్చేవారు కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్లుప్రమాదంజరిగిపాక్షికంగా అంగ వికలాంగులైతే రెండు లక్షల 50 వేల రూపాయలు ఇచ్చేవారు కానీ ముఖ్యమైన వాటిని సంక్షేమ బోర్డు పునర్ ప్రారంభించిన జీవోలో లేకపోవడం కార్మికులను మోసం చేయడమే అన్నారు. ఇతర రాష్ట్రాల్లో కేరళ తమిళనాడు మొదలగు రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు పథకాలే కాకుండా ప్రభుత్వం కూడా కొంత నిధిని కేటాయించి కొత్త పథకాలను కూడా భవన నిర్మాణం కార్మికులకు అమలు చేస్తున్నారు కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్న పథకాలనే తగ్గించి తూతూ మంత్రంగా పథకాలను అమలు చేస్తున్నామని భవన నిర్మాణ కార్మికులను మోసం చేస్తున్నది అన్నారు. అందువలన భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణం కార్మికుల సంక్షేమ బోర్డును పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ మార్చి ఒకటో తారీకు నుండి పదో తారీకు వరకు కార్మికులతో సంతకాల సేకరణ చేసి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కి పంపాలని పిలుపునివ్వడం జరిగింది అన్నారు. కూటమి ప్రభుత్వానికి భవన నిర్మాణ కార్మికులపై ఏమాత్రం ప్రేమ ఉన్న ఇచ్చినమాట నిలబెట్టుకోవాలన్నా భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి10లక్షలరూపాయలు ఇవ్వాలి పిల్లల చదువులు ఉచితంగా చెప్పించి స్కాలర్షిప్లు ఇవ్వాలి. ప్రమాదవశాత్తు అంగ వికలాంగులు అయితే 5 లక్షల రూపాయలు ఇవ్వాలి. సాధారణ మరణం జరిగితే కార్మికుని కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి మట్టి ఖర్చులకు 50 వేల రూపాయలు ఇవ్వాలి. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించినవిధంగా50సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ప్రతినెలా సంక్షేమ బోర్డు నిధుల ద్వారా పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలి. ఇల్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలము ఇచ్చి సంక్షేమ బోర్డు నిధుల ద్వారా ఉచితంగా ఇల్లు నిర్మించిఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులు ప్రసవ కానుక వివాహ కానుక ప్రమాదవశాత్తు మరణానికి సాధారణ మరణానికి మొదలగు వాటి మంజూరు కొరకు అర్జీలు పెట్టుకున్న క్లైములకు నిధులను విడుదల చేయకుండా తీరని అన్యాయం భవన నిర్మాణ కార్మికులకు చేశారని ప్రభుత్వం పెండింగ్ క్లైములకు వెంటనే నిధులు విడుదల చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఉత్తర్వులు ఇవ్వకపోతే ఏప్రిల్ నెల ఆరో తారీఖున భవన నిర్మాణ కార్మికులను వేలాదిగా తరలించి పెద్ద ఎత్తున పోరాటం చేసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు వై శంకర్ వి రాజు బి నరసింహులు బి మదిలేటి కే జానకి రామ్ ఎం రాజు బి గోపాల్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఫేక్ షాపింగ్ వెబ్‌సైట్లతో మోసపోవద్దు

సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ ప్రతినిధి మార్చి 1 (సీమ కిరణం న్యూస్) :** ఇటీవల కాలంలో ఆన్లైన్ షాపింగ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి సైబర్ నేరగాళ్ళు ప్రజలను మోసం చేసే సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రసిద్ధి చెందిన కంపెనీల పేర్లతో పోలి ఉండే వెబ్‌సైట్లు రూపొందించి, భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లు, తక్కువ ధరలకు ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు అందిస్తామని ప్రచారం చేస్తున్నారు. ఆ వెబ్‌సైట్ల ద్వారా ముందస్తు చెల్లింపులు తీసుకుని తర్వాత వస్తువులు పంపకుండా మోసం చేస్తున్నట్లు గుర్తించారు.

**కర్నూలు ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు.**

1) అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే కొనుగోళ్లు చేయాలి.
2) వెబ్‌సైట్ యుఆర్ఎల్ సరిగా ఉందో లేదో పరిశీలించాలి.
3) అతి తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పే ప్రకటనలను నమ్మకండి.
4) ఓటీపీ , బ్యాంక్ వివరాలు, కార్డ్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు.
5) అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా ఉండాలి.
6) సాధ్యమైనంత వరకు "క్యాష్ ఆన్ డెలివరీ" ఎంపికను ఉపయోగించాలి.

ఆన్లైన్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి లేదా కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సైబర్‌క్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ లో ఫిర్యాదు చేయాలని కోరారు. వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన మొత్తాన్ని తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను అరికట్టగలమని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ విజ్ఞప్తి చేశారు.

# ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ సమావేశంలో ప్రజా సమస్యలపై గలమెత్తిన డోన్ జడ్పిటిసి బద్దల రాజకుమార్



**డోన్ ప్రతినిధి మార్చి 1 (సీమ కిరణం న్యూస్) :** ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ సమావేశంలో డోన్ జడ్పిటిసి మెంబర్ బద్దల రాజ్ కుమార్ యాదవ్ డోన్ మండల ప్రజా సమస్యల ను తన యొక్క శైలిలో నియోజకవర్గ అభివృద్ధిపైన ఆదివారం జరిగిన జడ్పిటిసి జనరల్ బాడీ సమావేశంలో కలెక్టర్ కు అక్కడున్న అధికారులకు వివరించారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరియు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వివిధ అభివృద్ధి అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా

1.ఎడ్యుకేషన్ నాడు నేడు లో భాగంగా డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామంలోని పాఠశాలల అభివృద్ధి గురించి మాట్లాడడం జరిగింది, మరియు డోన్ మండలం లో ఎస్సీ బాయ్స్ హాస్టల్ టాయిలెట్లు మరియు వాటి పరిస్థితుల గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా

2. సివిల్ సప్లై కొత్త రేషన్ కార్డ్స్ అప్లై చేయడానికి హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ వెబ్సైట్స్ వర్క్ చేయడం లేదు అని కలెక్టర్ దృష్టికి తీసుకోవ జరిగింది.

3.ఆర్ బ్ల్యూఎస్ మాజీ మినిస్టర్ బుగ్గన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెచ్చిన అధునాతమైన ప్రాజెక్టు గోరకల్ రిజర్వాయర్ వాటర్ గ్రేడ్ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి డోన్ నియోజకవర్గం ప్రజల తాగునీటి సమస్యను వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ దృష్టికి మరియు అధికారులు దృష్టికి తీసుకోవడం జరిగినది.

## ఈ టైమ్‌లో ఏసీ అస్సలు ఆన్ చేయొద్దు.. చేస్తే మీ జేబుకు చిల్లు పడటం ఖాయం..











ఎండలు మండిపోతున్నాయి.. ఇంట్లో ఏసీ లేకపోతే నిమిషం కూడా ఉండలేని పరిస్థితి. కానీ నెల చివర్లో కరెంట్ బిల్లు చూస్తేనే గుండె ఆగినంత పనవుతోంది. ఏసీ ఎంత అవసరమో, కరెంట్ బిల్లు అంత భారంగా మారుతోంది. మరి ఏసీ వాడినా, బిల్లు తక్కువ వచ్చేలా చేయడం సాధ్యమేనా? అవును ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే చాలు.. మీ జేబుకు చిల్లు పడకుండా వేసవిని హాయిగా ఆస్వాదించవచ్చు.

మధ్యాహ్నం 12 నుండి 4 గంటల మధ్య ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఏసీ ఆన్ చేస్తే గది చల్లబడటానికి ఎక్కువ సమయం పట్టి, కరెంట్ ఎక్కువగా ఖర్చవుతుంది. కాబట్టి ఉదయం పూట లేదా సాయంత్రం వేళల్లో బయట ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ఏసీని ఆన్ చేయడం మంచిది. ఏసీని 24 నుండి 26 డిగ్రీల మధ్య సెట్ చేయండి. దీని వల్ల విద్యుత్ ఆదా అవ్వడమే కాకుండా మన శరీరానికి కూడా ఆరోగ్యకరమైన చల్లదనం లభిస్తుంది.

**1 / 5**

ఫ్యాన్ వాడకం: ఏసీ ఆన్ చేసిన వెంటనే ఫ్యాన్‌ను కూడా ఆన్ చేయండి. ఇది గదిలోని చల్లని గాలిని అన్ని మూలలకు త్వరగా వ్యాపింపజేస్తుంది. ఏసీ ఆన్ చేసిన తర్వాత గదిలోని చల్లదనం బయటకు పోకుండా తలుపులు, కిటికీలను సరిగ్గా మూసివేయాలి.

**2 / 5**

ప్రీ-కూలింగ్: మధ్యాహ్నం వేళ ఏసీ వాడకుండా, ఉదయమే ఏసీతో గదిని పూర్తిగా చల్లబరచండి. ఆ తర్వాత ఏసీ కట్టేసి, మధ్యాహ్నం వేళలో కేవలం ఫ్యాన్లతో ఆ కూలింగ్‌ను కాపాడుకోవచ్చు.

**3 / 5**

సాధారణ ఏసీల కంటే ఇన్వర్టర్ ఏసీలు విద్యుత్‌ను చాలా తక్కువగా వినియోగిస్తాయి. ఇవి గది ఉష్ణోగ్రతను బట్టి కంప్రెసర్ వేగాన్ని సర్దుబాటు చేసుకుంటాయి. స్మార్ట్ థర్మోస్టాట్స్ ఉపయోగించి ఏసీని మనకు కావాల్సిన సమయానికి ఆటోమేటిక్‌గా ఆన్,ఆఫ్ అయ్యేలా షెడ్యూల్ చేసుకోవచ్చు.

**4 / 5**

కిటికీలకు మందపాటి కర్టెన్లు వేయడం వల్ల సూర్యరశ్మి నేరుగా ఇంట్లోకి రాకుండా, గది వేడెక్కకుండా ఉంటుంది. ఇంటి చుట్టూ మొక్కలు పెంచడం వల్ల కూడా సహజంగానే ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

## బ్యాంక్ అకౌంట్ ఉన్నవాళ్లకు గుడ్ న్యూస్.. ఆర్బీఐ కీలక ఆదేశాలు.. ఇక ఆ బాధ ఉండదు..






డిజిటల్ బ్యాంకింగ్ రోజురోజుకూ పెరుగుతున్నా.. అందులోని పారదర్శకతపై అనుమానాలు అలాగే ఉన్నాయి. కస్టమర్ల అనుమతి లేకుండానే సేవలను యాక్టివేట్ చేయడం, దాగుడుమూతల ఛార్జీలు విధించడంపై ఆర్‌బీఐ కొరడా ఝుళిపించింది. బ్యాంకులు తమ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లలో వినియోగదారులను మోసం చేసే డార్క్ ప్యాటర్న్స్‌పై కీలక ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ బ్యాంకింగ్ యుగంలో మన చేతిలో మొబైల్ ఉంటే చాలు.. బ్యాంకింగ్ పనులన్నీ చిటికెలో పూర్తవుతాయి. అయితే ఈ సౌలభ్యంతో పాటు కొన్ని ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ముఖ్యంగా బ్యాంక్ యాప్‌లు, వెబ్‌సైట్ల రూపకల్పనలో వినియోగదారులను తప్పుదారి పట్టించే డార్క్ ప్యాటర్న్స్ పట్ల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి మోసపూరిత విధానాలకు స్వస్తి పలకాలని బ్యాంకులకు గడువు విధించింది.

**ఏమిటీ డార్క్ ప్యాటర్న్స్?**

బ్యాంకింగ్ సేవలను వాడుకునేటప్పుడు మనకు తెలియకుండానే అదనపు ఛార్జీలు పడటం, అవసరం లేని ఇన్సూరెన్స్ లేదా సర్వీసులను పదేపదే పాప్ అప్‌ల ద్వారా చూపించడం, క్లిష్టమైన నిబంధనలతో గందరగోళానికి గురిచేయడం వంటి వాటిని డార్క్ ప్యాటర్న్స్ అంటారు. ఇవి వినియోగదారులను తప్పుదోవ పట్టించి, డబ్బులు ఖర్చు పెట్టేలా చేస్తాయి.

**ఆర్‌బీఐ కీలక ఆదేశాలు.. 2026 జూలై డెడ్ లైన్**

వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడానికి ఆర్‌బీఐ రెస్పాన్సిబుల్ బిజినెస్ కండక్ట్ అమెండ్మెంట్ డైరెక్షన్ 2026 ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది.

బ్యాంకులు తమ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లలో ఉన్న అన్ని రకాల డార్క్ ప్యాటర్న్స్‌ను 2026 జూలై నాటికి పూర్తిగా తొలగించాలి.

ఆర్థిక ఉత్పత్తులను ప్రచారం చేసేటప్పుడు వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనలు చేయకూడదు.

ఏదైనా కొత్త సేవను అందించే ముందు లేదా అదనపు ఛార్జీ విధించే ముందు వినియోగదారుడి నుండి స్పష్టమైన అనుమతి తీసుకోవడం తప్పనిసరి.

**వినియోగదారులకు కలిగే లాభాలు:**

తాము తీసుకునే సేవలు, వాటి ఛార్జీల గురించి పూర్తి అవగాహన ఏర్పడుతుంది.

తెలియకుండా జరిగే లావాదేవీలు ఆగిపోతాయి.

పారదర్శకమైన విధానాల వల్ల బ్యాంకింగ్ వ్యవస్థపై కస్టమర్ల విశ్వాసం పెరుగుతుంది.

ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం డిజిటల్ బ్యాంకింగ్‌ను మరింత సురక్షితంగా, బాధ్యతాయుతంగా మార్చనుంది. వినియోగదారులు కూడా బ్యాంకింగ్ యాప్‌లను ఉపయోగించేటప్పుడు నిబంధనలను జాగ్రత్తగా చదవడం మంచిది.

## హెచ్‌డీఎఫ్‌సీ కస్టమర్లకు షాకింగ్ న్యూస్.. ఆ ఛార్జీలు భారీగా పెంపు.. ఇక నుంచి బాదుడే..




హెచ్‌డీఎఫ్‌సీ కస్టమర్లకు బిగ్ అలర్ట్. లాకర్ల నిర్వహణకు సంబంధించి కీలక మార్పులు చేసింది. ఇక నుంచి లాకర్లను యాక్సెస్ చేయాలంటే ఆధార్ బయోమెట్రిక్ వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఇక లాకర్ల ఛార్జీలను కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీగా పెంచింది. వాటి వివరాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాకర్ల రూల్స్‌లో కీలక మార్పులు చేసింది. లాకర్లను కస్టమర్లు యాక్సెస్ చేసుకునే రూల్స్‌ను కఠినతరం చేసింది. ఇక నుంచి లాకర్లను ఓపెన్ చేయాలంటే ఖచ్చితంగా ఆధార్ అథెంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తి చేస్తేనే లాకర్‌ను వినియోగదారులు యాక్సెస్ చేయగలరు. లాకర్లను యాక్సెస్ చేసే ముందు వినియోగదారులు అందరూ తప్పనసరిగా ఆధార్ ఆథెంటికేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని, అప్పుడే లాకర్‌కు యాక్సెస్ మంజూరు అవుతుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. ఇక నుంచి బ్యాంక్ ప్రతినిధిని లాకర్ గది బయటే ఉంచుతారు. లాకర్ సురక్షితంగా ఉందని నిర్ధారించేందుకు ఇది ఉపయోగపడుతుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పష్టం చేసింది.

**లాకర్ ఎలా యాక్సెస్ చేయాలంటే..?**

ఇక నుంచి హెచ్‌డీఎఫ్‌సీ కస్టమర్లు తమ లాకర్‌ను యాక్సెస్ చేయాలంటే ముందుగా ఆధార్‌తో అనుసంధానమైన బయోమెట్రిక్ వివరాలను అందించాల్సి ఉంటుంది. ఆ బయోమెట్రిక్ వివరాలు ఉపయోగించే లాకర్లను యాక్సెస్ చేసుకోవచ్చు. లేకపోతే లాకర్లను తెరవడానికి కుదరదు. ఇప్పటినుంచి కాగిత రహిత విధానంలోని లాకర్ల యాక్సెస్‌ను మార్చుతున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పష్టం చేసింది. లాకర్లకు భద్రత కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. సురక్షితంగా, సమర్థవంతంగా లాకర్లను నిర్వహించుకునేందుకు ఈ ప్రక్రియ ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఇక కస్టమర్లు లాకర్లను తెరిచి ఉపయోగించుకున్న తర్వాత బ్రాంచ్ కస్టోడియన్లు తిరిగి చెక్ చేయాల్సిన అవసరం ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

**లాకర్ ఫీజులు పెంపు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాకర్ల హోల్డర్లకు షాక్ ఇచ్చింది. లాకర్ల ఫీజులను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మెట్రో, అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో లాకర్ల ఛార్జీలను పెంచింది. మెట్రో నగరాల్లో లాకర్లను ఉపయోగించుకునేందుకు ఏడాదికి రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రూ.2,250గా ఉన్న వార్షిక ఫీజులను ఒకేసారి భారీగా పెంచింది. ఇక పెద్ద లాకర్ల ఛార్జీలను రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారమే వీటిని పెంచినట్లు వెల్లడించింది. దాదాపు దశాబ్దం తర్వాత లాకర్ల ఛార్జీలను మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా పెంచినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పష్టం చేసింది. కాగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ 10వ స్థానంలో ఉండగా.. దేశంలో తొలి స్థానంలో నిలిచింది. లాకర్లకు అదనపు భద్రత, నిర్వహణ ఖర్చుల కారణంగా ఛార్జీలను పెంచినట్లు స్పష్టం చేసింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి.

## పీపీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం అలర్ట్.. అమల్లోకి కొత్త రూల్.. రెండు అకౌంట్లు ఓపెన్ చేస్తే..



పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ అకౌంట్ గురించి మనందరికీ తెలిసిందే. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన సేవింగ్స్ స్కీమ్ ఇది. లక్షల మంది ఇందులో పెట్టుబడులు పెడుతున్నారు. సామాన్యులు కూడా తక్కువ మొత్తంలో సొమ్మును ఇందులో పొదుపు చేసుకోవచ్చు. దాదాపు 7.1 శాతం వడ్డీ లభిస్తుంది. డబ్బులు పొదుపు చేసుకోవాలనుకునేవారి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పొదుపు పథకాలను అమలు చేస్తోంది. అందులో బాగా పాపులర్ అయిన, అందరికీ తెలిసిన స్కీమ్ పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(గ్రాఫీ). ఉద్యోగులు, వ్యాపారులు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు కూడా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు. ఇందులో ఇన్వెస్ట్ చేస్తే అధిక ఆదాయంతో పాటు ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా ఉన్నాయి. దీంతో అధిక మొత్తంలో జీతం తీసుకునేవారికి, వ్యాపారులకు ఇది మంచి పథకమని చెప్పవచ్చు. అధిక ఆదాయం, ట్యాక్స్ బెనిఫిట్స్, ప్రభుత్వం నిర్వహించే సేవింగ్స్ స్కీమ్ కావడంతో భద్రత ఉంటుందనే ఉద్దేశంతో చాలామంది పీపీఎఫ్‌లో పెట్టుబడులు పెడుతూ ఉంటారు.

**రెండు పీఎఫ్ ఖాతాలు ఓపెన్ చేయవచ్చా..?**

ఒక వ్యక్తి పేరుపై ఒకటి కంటే ఎక్కువ పీపీఎఫ్ ఖాతాలు తెరవచ్చా అనే అనుమానం చాలామందికి ఉంటుంది. కానీ పీపీఎఫ్ నిబంధనల ప్రకారం.. ఒక వ్యక్తి ఒక అకౌంట్ మాత్రమే తెరవడానికి అనుమతి ఉంటుంది. పీపీఎఫ్ స్కీమ్ 2019 నిబంధనల ప్రకారం ఫారం-1 నింపి ఏ వ్యక్తి అయినా సులువుగా ఈ అకౌంట్ తెరవొచ్చు. ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు, ఉమ్మడి ఖాతాలు తెరవడానికి అనుమతి లేదు. ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ అధికారిక వెబ్ సైట్‌లో ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి.

**రెండో అకౌంట్ చెల్లదు**

ఒక వ్యక్తి పేరు మీద రెండు అకౌంట్లు తెరిస్తే.. రెండోసారి తెరిచిన అకౌంట్ చెల్లదు. మీ పీపీఎఫ్ అకౌంట్ పాన్ నెంబర్‌తో లింక్ అయి ఉంటుంది. దీని మీరు రెండో అకౌంట్ ఓపెన్ చేస్తే ఆటోమేటిక్‌గా తెలిసిపోతుంది. దీంతో రెండో అకౌంట్‌ను చెల్లనిదిగా పరిగణిస్తారు. మీరు రెండో ఖాతాలో జమ చేసిన సొమ్మును వడ్డీ లేకుండా తిరిగి ఇచ్చేస్తారు. ఒక వ్యక్తి పేరుపై ఒక పీపీఎఫ్ ఖాతా మాత్రమే తెరవడానికి అనుమతి ఉంది. ఇక మైనర్లకు కూడా పీపీఎఫ్ అకౌంట్ ఓపెన్ చేయవచ్చు. కానీ వారికి 18 ఏళ్లు వచ్చేంతవకు సంరక్షకుడి ఆధ్వర్యంలో ఇది నిర్వహించాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.500 నుంచి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. 15 ఏళ్ల పాటు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మీకు మెచ్యూరిటీ పిరియడ్ తర్వాత అధిక మొత్తంలో ఒకేసారి వడ్డీతో సహా పొందవచ్చు. ప్రస్తుతం పీపీఎఫ్ వడ్డీ రేటు 7.1 శాతం ఉంది. బ్యాంకుల ఫిక్స్ డ్ డిపాజిట్లతో పోలిస్తే ఇది ఎక్కువనే చెప్పవచ్చు. ఎక్కువ పెట్టుబడి పెట్టాలంటే ఇతర సేవింగ్స్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

## ఐదేండ్లలో 500 నెక్సా స్టూడియోలు




కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ ఇండియా.. ప్రీమియం రిటైల్ చెయిన్ నెక్సాను భారీ స్థాయిలో విస్తరించబోతున్నది. 2030-31 నాటికి దేశవ్యాప్తంగా నెక్సా స్టూడియోల సంఖ్యను 700కి పెంచబోతున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. తన 200 అవుట్‌లెట్‌ను హర్యానాలో శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..కంపెనీ మొత్తం విక్రయాల్లో 25-30 శాతం చిన్నగా ఏర్పాటు ప్రీమియం రిటైల్ అవుట్‌లెట్ల నుంచి సమకూరుతుండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. గడిచిన ఏడాదిన్నరలో ప్రతి మూడు రోజులకు ఒక నెక్సా స్టూడియో(అవుట్‌లెట్)ను ప్రారంభించినట్టు చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో నెక్సా నుంచి 40 శాతం సమకూరుతుండగా, మిగతా 60 శాతం అరెనా షోరూంల నుంచి లభిస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో ఏర్పాటు చేయనున్న నెక్సా స్టూడియోల్లో ప్రీమియం అనుభూతి కల్పించనున్నట్టు, ముఖ్యంగా మెట్రోలు, ఈవీ చార్జింగ్ సదుపాయం కూడా ఈ స్టూడియోలో ఉంటుందన్నారు. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన తన తొలి ఈ-విటారా ఎస్‌యూవీ కోసం చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నది.

## 5 లక్షల కోట్ల సంపద ఆవిరి..

## సెన్సెక్స్ 961, నిఫ్టీ 318 పాయింట్ల పతనం



దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతుండటం, పలు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మరింత నష్టాల్లోకి నెట్టాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ వారాంతపు ట్రేడింగ్ ముగిసే సరికి 961.42 పాయింట్లు లేదా 1.17 శాతం కోల్పోయి 81,287.19 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 317.90 పాయింట్లు లేదా 1.25 శాతం నష్టపోయి 25,178.65 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు రూ.5 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్‌ఈలో లైస్టెన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.4,98, 603.42 కోట్లు కరిగిపోయి రూ.4,63, 50, 671.27 కోట్లు (5.10 ట్రిలియన్ డాల ర్లు) చేరుకున్నది. దేశీయ స్టాక్ మార్కె ట్లు దిద్దుబాటుకు గురవుతున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండటంతో మదుపరుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం, ఏఐకి సంబంధించి అనిశ్చిత పరిస్థితులు కూడా తోడవడంతో మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి ఆజ్యంపోశాయన్నారు. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో, మారుతి, కొటక్ బ్యాంక్ షేర్లు రెండు శాతానికి పైగా కోల్పోయాయి. వీటితోపాటు అల్ట్రాటెక్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్‌ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్, రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ, టీసీఎస్, టెక్ మహీంద్రా, టైటాన్, ఎల్అండ్‌టీ షేర్లు కూడా నష్టపోయాయి.

హెచ్‌సీఎల్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు ఒక్క శాతం వరకు పతనం చెందాయి.

రంగాలవారీగా రియల్టీ సూచీ అత్యధికంగా 2.25 శాతం నష్టపోగా, టెలికాం 1.83 శాతం, ఆటో 1.81 శాతం, మెటల్ 1.57 శాతం, కమోడిటీస్ 1.56 శాతం, ఎఫ్ఎంసీజీ 1.52 శాతం, ఆర్థిక సేవలు 1.50 శాతం చొప్పున పతనం చెందాయి.

కానీ, ఐటీ, ఐటీ అనుబంధ రంగాల సూచీ లాభాల్లో ముగిసింది.

ఈ వారం సెన్సెక్స్ 1,527.52 పాయింట్లు లేదా 1.84 శాతం, నిఫ్టీ 392.60 పాయిం ట్లు లేదా 1.53 శాతం పతనం చెందాయి.

## తగ్గిన దేశ వృద్ధిరేటు..

## కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలు విడుదల

అక్టోబర్-డిసెంబర్‌లో 7.8 శాతంగా నమోదు

అంతకుముందు త్రైమాసికంలో 8.4 శాతంగా రికార్డు

ఈ ఆర్థిక సంవత్సరం 7.6 శాతంగా అంచనా




దేశ జీడీపీ వృద్ధిరేటు తగ్గుముఖం పట్టింది. పాత సిరీస్‌ను కాదని, కొత్త సిరీస్‌ను తెచ్చి లెక్కించినా.. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని దాచలేకపోయింది నరేంద్ర మోదీ సర్కార్. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో ఆర్థిక ప్రగతి రేటు 7.8 శాతంగానే ఉన్నట్టు తేలింది మరి. అంతకుముందు త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)తో పోల్చితే 0.6 శాతం పడిపోయింది. నాడు 8.4 శాతంగా ఉన్నది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ.. 2022-23 బేస్ ఇయర్ (ఆధారిత సంవత్సరం)తో నూతన వార్షిక, త్రైమాసిక జాతీయ పద్దు అంచనాల సిరీస్‌ను విడుదల చేసింది. ఇప్పటిదాకా ఉన్న 2011-12 బేస్ ఇయర్ జీడీపీ గణన సిరీస్ స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. కాగా, జీడీపీ గణనకు బేస్ ఇయర్‌లను ఇలా సవరించడం ఇది తొమ్మిదోసారి.

**ఇదీ సంగతి..**

కొత్త సిరీస్‌తో దేశ జీడీపీ లెక్కింపు పద్ధతిని కేంద్రం సవరించింది. బేస్ ఇయర్‌ను మార్చడమేగాక, దేశంలోని ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రతిబింబించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈ-వాహన్ పోర్టల్‌ల డాటానూ జీడీపీ గణనకు అనుసంధానం చేశారు. ఇంతకుముందు జీఎస్టీ, ఈ-వాహన్ పోర్టల్ డాటా.. జీడీపీ లెక్కింపు పరిధిలోకి వచ్చేది కాదు. ఇదిలావుంటే కొత్త సిరీస్ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలను కేంద్రం సవరించింది. పాత సిరీస్ ప్రకారం 8.2 శాతంగా ఉంటే.. ఇప్పుడది 8.4 శాతానికి పెరిగింది. దీంతో చూస్తే.. అక్టోబర్-డిసెంబర్ జీడీపీ వృద్ధిరేటు 0.6 శాతం పడిపోయి 7.8 శాతానికే పరిమితమైంది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024-25) అక్టోబర్-డిసెంబర్‌తో పోల్చితే మాత్రం పెరిగింది. అప్పుడు 7.4 శాతంగా ఉన్నది. ఇక ఈసారి తయారీ, సేవా రంగాల్లో వృద్ధి కనిపించినట్టు కేంద్రం చెప్తున్నది.

**ఈసారి 7.6 శాతం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పాత సిరీస్‌లో ఈ అంచనా 7.4 శాతంగానే ఉన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే. కాగా, జీడీపీ గణనలో బేస్ ఇయర్ మార్పుతో దేశంలోని ఆర్థిక కార్యకలాపాల అసలు విలువ మరింత స్పష్టంగా తెలుస్తుందని మోదీ సర్కార్ భావిస్తున్నది. అందుకే మొత్తం ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాను పెంచింది. ఇక ఈ 2025-26లో దేశ జీడీపీ విలువ రూ.322.58 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా. కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ చెప్తున్నది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com